గంగ పుత్రులకు దిక్కెవరు..?

- జాలరి ఎండాడ తీరంలో వేట చేస్తూ సముద్రంలో కొట్టుకుపోయిన సతీష్
- గల్లంతై ఐదు రోజులైనా పట్టించుకోని పాలకులు, అధికారులు
- మృతదేహం లభించకపోవడంతో గ్రామస్తుల ఆవేదన
- కన్నీరు మున్నీరవుతున్న కుటుంబ సభ్యులు
- అధికారులు, పాలకుల తీరుపై సర్వాత్రా విమర్శలు



సాక్షి మీడియాతో ఆవేదన వ్యక్తం చేస్తున్న యువకుడు



సతీష్ ఆచూకీ కోసం తీరంలో ఎదురు చూస్తున్న మత్స్యకార గ్రామాల ప్రజలు



సతీష్ మృతదేహాన్ని వెతికేందుకు బోటులో వెళ్తున్న మత్స్యకారులు

ఎంవీపీ కాలనీ : కూటమి ప్రభుత్వంలో గంగపుత్రులను పాలకులు, అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. మత్స్యకారులకు ఆపదొస్తే మేమున్నామంటూ భరోసా కల్పించడం లేదు. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమే జాలరి ఎండాడ తీరంలో వేట చేస్తూ గల్లంతైన మత్స్యకార యువకుడు పిల్లా సతీష్ (24) ఉదంతం. ఆ యువకుడి ఆచూకీ ఐదు రోజులైనా లభించలేదు. గత ఆదివారం చేపల వేట చేస్తూ ప్రమాదవశాత్తూ సతీష్ సముద్రంలో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి సతీష్ జాడ కోసం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.

అయితే సతీష్‌ను వెతికేందుకు జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కనీస బాధ్యత తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఘటన జరిగిన రోజే పోలీసులతోపాటు స్థానిక ఎమ్మెల్యే వెలగపూడికి, జిల్లా అధికార యంత్రాంగానికి మత్స్యకారులు సమాచారమిచ్చినా కనీసం వారు పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో గ్రామస్తులే బోట్లు ఏర్పాటు చేసుకుని తీరం వెంబడి సతీష్ మృతదేహం కోసం వెతుకుతున్నారు. అయితే ఐదు రోజులైనా సతీష్ మృతదేహం లభించకపోవడంతో జాలరి ఎండాడ గ్రామంలో విషాదం నెలకొంది. రోజులు గడిచేకొద్దీ సతీష్ మృతదేహం కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయా..? లేదా..? అనే అనుమానం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఘటన జరిగిందిలా..

ఇటీవల అల్పపీడనం నేపథ్యంలో లాసన్స్ బే కాలనీ గెడ్డ వద్దకు సతీష్ గేలంతో చేపలు పట్టేందుకు మరో వ్యక్తితో కలిసి వెళ్లాడు. వర్షం సమయంలో చేపలు విరివిగా దొరకుతాయనే ఆశతో వేటకు వెళ్లిన అతన్ని మృత్యువు వెంటాడింది. గెడ్డ సముద్రంలో కలిసే చోట గేలం వేస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. ఒక్కసారిగా గెడ్డ ఉధృతిలో చిక్కుకోవడంతో సముద్రంలోకి కొట్టుకుపోయాడు. అతనితోపాటు వెళ్లిన సహచరుడు చూస్తుండగానే ఇదంతా జరిగిపోయింది. అయితే సతీష్‌కు ఈత రావడంతో కొద్ది సేపటికి ఈదుకుంటూ ఒడ్డుకు వస్తాడని అందరూ భావించారు. దురదృష్టవశాత్తూ గంటలు గడిచినా రాకపోవడంతో పోలీసులకు, మత్స్యకార శాఖకు, స్థానిక నాయకులకు, ఎమ్మెల్యేకు సమాచారం అందించారు. సతీష్ మృతదేహాన్ని అయినా అప్పగించాలని కోరుకున్నారు. అయినప్పటికీ స్థానిక నాయకులతోపాటు అధికారులు ఎవ్వరూ కనీసం స్పందించకపోవడం వారిని తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది.

సొంత ఖర్చులతో వెతుకుతున్నాం



మా తమ్ముడు చనిపోయాడనే పుట్టెడు దుఃఖంలోనూ మృతదేహం కోసం మేమే వెతుకులాడుకుంటున్నాం. జాలరి ఎండాడ గ్రామంలోని మత్స్యకారుల సహకారంతో కనీసం మృతదేహమైనా దొరికితే చాలని సొంత ఖర్చులతో బోట్లుకు డీజిల్ కొట్టించుకుని తీరం వెంబడి ఐదు రోజులుగా వెతుకుతున్నాం. అధికారులకు, పాలకులకు అందరికీ విషయం తెలియజేసినా వాళ్లెవ్వరూ కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. బోట్లకు డీజిల్ కోసం నాకు తెలిసిన స్నేహితులు, కుటుంబ సభ్యుల దగ్గర రూ.2 వేలు, రూ.3 వేలు అప్పు తీసుకుని మృతదేహం కోసం గాలిస్తున్నాం

– పిల్లా ఎల్లాజీ, సతీష్ అన్నయ్య

మత్స్యకారులను ఆదుకోరా..?



బీచ్‌లో ఎవరైనా గల్లంతైనా, ధనిక వర్గానికి సంబంధించిన వ్యక్తులు తీరంలో కొట్టుకుపోతే అధికారులు, పాలకులు ఆగమేఘాలపై స్పందించేవారు. మత్స్యకారులు పేదవాళ్లు కావడంతోనే పాలకులు, అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. మృతదేహాన్నైనా ఇప్పించాలని వేడుకుంటున్నా వారి నుంచి కనీస స్పందన లేదు. నా బిడ్డ గుల్లంతై ఐదు రోజులు గడిచిపోయింది. మృతదేహాన్ని సముద్ర చేపలు, ఇతర జీవులు తినేసేలోపు గుర్తించి అప్పగించాలని, ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించాలని వేడుకుంటున్నాం.

– వీర్రాజు, సతీష్ తండ్రి

బయో డైవర్సిటీ పార్క్ సందర్శన



పార్కులో డిగ్రీ కళాశాల విద్యార్థులు

బీచ్‌రోడ్డు : శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పెదవాల్తేరులోని బయో డైవర్సిటీ పార్క్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పార్క్ పర్యవేక్షకుడు రామ్మూర్తి విద్యార్థులకు వివిధ మొక్కల ప్రాముఖ్యతను వివరించారు. మొక్కల శాస్త్రీయ నామాలు, ఉపయోగాలు, ఎటువంటి వాతావరణంలో పెరుగుతాయో తెలియజేశారు.

మొక్కే కదాని వదిలేస్తే..?



పార్క్‌లో రావి మొక్కలు

ఏయూ క్యాంపస్ : స్థానిక వీఎంఆర్‌డీఏ పార్కులో రావి మొక్కలు విస్తరిస్తున్నాయి. ప్రాథమిక దశలో వీటిని తొలగించాల్సిన అవసరం ఉంది. లేకుంటే ఇక్కడి నిర్మాణాలకే ఆ మొక్కలు ముప్పు తెచ్చే ప్రమాదం ఉంది. బీచ్‌రోడ్డులోని ఉడా పార్క్ ఆవరణలో పర్యాటకులు సేద తీరడానికి గతంలో అధునాతన టెంట్ వంటి నిర్మాణాలు జరిపారు. వీటిలో ప్రస్తుతం రావి మొక్కలు పెరిగిపోతున్నాయి. దీంతో ఈ నిర్మాణం దెబ్బతినే ప్రమాదం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని గార్డెనింగ్ సిబ్బంది తొలగించి, నీడనిచ్చే నిర్మాణాలు దెబ్బతినకుండా సంరక్షించాల్సిన అవసరం ఉంది.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో శుక్రవారం పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. పైనాపిల్‌కాలనీ 33/11 కేవీ, అంబేడ్కర్‌నగర్ 11 కేవీ పరిధిలో పలుచోట్ల మరమ్మతులు చేపట్టనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్ – 3 ఈఈ బి.సింహాచలం నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయా ఫీడర్ల పరిధిలో పైనాపిల్‌కాలనీ, ఎస్.ఎస్.ఎన్.నగర్, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ఆరిలోవ ఆఖరి బస్టాప్, ఎస్.కె.ఎం.ఎల్.నగర్, పాండురంగాపురం, జైభీమ్ నగర్, శివశంకర్‌నగర్, దుర్గాబజార్, ఆరిలోవ పాత పోలీస్ స్టేషన్, దుర్గానగర్, నెహ్రూనగర్, లీలా సుందరినగర్, ఎస్సీ ఎస్టీ కాలనీ, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

చంద్రశేఖర్‌కు సత్కారం



పశు సంవర్ధక శాఖ డీడీ డాక్టర్ చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

ఆరిలోవ : జిల్లా పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మోపాడ చంద్రశేఖర్‌ను డెయిరీఫారం వద్ద జిలా కార్యాలయంలో సిబ్బంది గురువారం సత్కరించారు. జిల్లాలో పాడి పశువులు, రైతులకు అందించిన సేవలను గుర్తించి స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయనకు బుధవారం విజయవాడలో పశు సంవర్ధక శాఖ సంచాలకుడు ఉత్తమ సేవా అవార్డు అందించారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా కార్యాలయంలో ఏపీ లైవ్‌స్టాక్ అసిస్టెంట్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనం గోవింద్ ఆధ్వర్యంలో సిబ్బంది సత్కరించి అభినందించారు. ఆయన సేవలను గుర్తించి ఉత్తమ అవార్డు అందించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


విద్యార్థులకు కంటి పరీక్షలు



బీవీకే పాఠశాలలో బాలికకు కంటి పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

ఆరిలోవ : జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి బీవీకే పాఠశాలలో గురువారం విజన్ ట్రీ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఇక్కడ ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న సుమారు 400 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. వారిలో 34 మంది విద్యార్థులకు సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా కంటి సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విజన్ ట్రీ కంటి వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు.

వీధి దీపం వెలగక అంధకారం



శివాజీపాలెం ఆరు కుళాయిల జంక్షన్ వద్ద వెలగని వీధి దీపం

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డు పరిధి శివాజీపాలెంలోని ఆరు కుళాయిల జంక్షన్ వద్ద వీధి దీపం వెలగక అంధకారం రాజ్యమేలుతోంది. విద్యుత్ స్తంభం నంబర్ 18/ఎ2/3 పై గల దీపం కొద్ది రోజులుగా వెలగడం లేదని స్థానికులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో అంతా చీకటిమయం కావడంతో ఇబ్బంది పడుతున్నామని, సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నిరాశ్రయుల వసతి గృహానికి ముగ్గురి తరలింపు

అల్లిపురం: విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శ్రీకారం చుట్టిన 'జ్యోతిర్గమయ' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా యాచకులు, ఇంటి నుంచి తప్పిపోయిన, మతిస్థిమితం లేని 73 మంది తమ ఆధీనంలోని పునరావాస కేంద్రాల్లో ఉన్నట్టు కమిషనర్ తెలిపారు. పోలీస్ కమిషనరేట్ ప్రాంతంలో ముగ్గురు యాచకులు ఉన్నట్టు డీసీపీ అజిత వేజెండ్ల సమాచారం అందించడంతో గురువారం ఉదయం టూ టౌన్ సీఐ ఎర్రం నాయుడు, ఎస్ఐ సతీష్, హెడ్ కానిస్టేబుల్ కొండ, కన్నారావు అక్కడికి చేరుకుని వారికి భీమనగర్‌లోని పురుషుల నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించినట్లు తెలిపారు.

జూ పార్కుకు ఐవోబీ వితరణ



జూలో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలను ప్రారంభిస్తున్న రవికుమార్ గుప్తా, మంగమ్మ

ఆరిలోవ : ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐవోబీ) కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్ఆర్)లో భాగంగా ఇందిరాగాంధీ జూ పార్కుకు సహకారం అందించింది. ఇందులో భాగంగా సందర్శకుల సౌలభ్యం కోసం జూలో 25 సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసింది. ఈ బెంచీలను గురువారం ఐవోబీ రీజినల్ మేనేజర్ రవికుమార్ గుప్తా, జూ క్యూరేటర్ జి.మంగమ్మ ప్రారంభించారు. ఆ బెంచీలను జూలో పలుచోట్ల సందర్శకులకు వీలుగా ఉండేవిధంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ ఐవోబీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐవోబీ చీఫ్ మేనేజర్ డి.శ్రీనివాసరావు, పలు బ్రాంచ్‌ల అధికారులు సుష్మా, కె.మురళి, పి.శ్రీనివాసరావు, జూ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.ఉమాదేవి, అసిస్టెంట్ క్యూరేటర్ బి.గోపి, సీనియర్ అకౌంటెంట్ కె.సన్యాసినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వుడా పార్కులో విరిగిన ఆట వస్తువులు



వుడా పార్కులో విరిగిన ఉయ్యాల



పార్కులో దెబ్బతిన్న ఫ్లోరింగ్

ఏయూ క్యాంపస్ : బీచ్‌రోడ్డులోని వుడా పార్క్ ఆవరణలో పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువుల ప్రాంగణంలోని ఉయ్యాల విరిగిపోయింది. వీటిని ఇటీవల ఏర్పాటు చేశారు. నాణ్యత లోపం కారణంగా విరిగిపోయినట్లు తెలుస్తోంది. అదేవిధంగా ఉయ్యాలలు ఉన్న ప్రాంగణంలోని ఫ్లోరింగ్ మ్యాట్‌లు సైతం దెబ్బతిన్నాయి. వీటిని మార్పు చేయాల్సిన అవసరం ఉంది. పార్క్‌లో కొత్త వస్తువులు ఏర్పాటు చేస్తున్న అధికారులు, వాటి నాణ్యతపై దృష్టి సారించకపోవడం వల్లే త్వరగా పాడైపోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్లాస్మాఫెరెసిస్ చికిత్సతో సత్ఫలితాలు



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీనారాయణ

బీచ్‌రోడ్డు : రామ్‌నగర్‌లోని అపోలో హాస్పిటల్స్ వైద్యులు ప్లాస్మాఫెరెసిస్ చికిత్స అందించి 35 ఏళ్ల వ్యక్తి ప్రాణాలు కాపాడారు. ప్రామాణిక విషవిరుగుడు మందులు పనిచేయనప్పుడు అందించే ఈ చికిత్స సత్ఫలితాలు ఇస్తుందని న్యూఢిల్లీలోని ఇంటర్నల్ మెడిసిన్ వైద్యులు డాక్టర్ కె.లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ చికిత్స విధానం అపోలోకి కొత్త విజయాన్ని అందించిందన్నారు. సుమారు అర లీటరు అధిక సాంద్రత కలిగిన క్లోరోపైరిఫోస్ తీసుకున్న రోగి అపోలో అత్యవసర విభాగానికి చేరుకుని అపస్మారక స్థితిలోకి జారిపోయాడని... చికిత్స చేసిన తర్వాత అతను నాలుగు రోజులు వెంటిలేటర్‌పై గడిపి కోలుకున్నాడని తెలిపారు. ప్లాస్మాఫెరెసిస్ చికిత్సను వేగవంతంగా ప్రారంభించడంతో క్లిష్టమైన పరిస్థితి నుంచి పూర్తిగా కోలుకున్నాడని తెలిపారు. డాక్టర్ శెట్టి అనిల్ పాత్రో (నెఫ్రాలజిస్ట్), డాక్టర్ రమేష్ బాబు ముటికి (న్యూరాలజిస్ట్), క్రిటికల్ కేర్ లీడ్ డాక్టర్ శ్రీనివాస్ సీహెచ్, డాక్టర్ మంజుషా విజయవంతంగా చికిత్స అందించారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సాగర్ మృతదేహం

బీచ్‌రోడ్డు : బీచ్ రోడ్డులో సబ్‌మెరైన్ వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పూర్ణా మార్కెట్ ప్రాంతానికి చెందిన కె.సాగర్ (26) స్నేహితుడితో కలిసి పార్క్ హోటల్ నుంచి ఆర్కే బీచ్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ముందు బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అకస్మాత్తుగా యూటర్న్ తీసుకోవడంతో ఆ వాహనాన్ని సాగర్ ఢీకొట్టి కింద పడిపోయాడు. హెల్మెట్ లేకపోవడంతో సాగర్ తలకు తీవ్రగాయమై చికిత్స పొందుతూ గంట వ్యవధిలోనే మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

23 నుంచి సంగీత నృత్యోత్సవాలు



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ప్రతినిధులు ఎంఎస్ఎన్ రాజు, రాంబాబు, కృష్ణప్రసాద్

మద్దిలపాలెం: కళలకు నెలవైన కళాభారతి ప్రాంగణంలో ఈ నెల 23 నుంచి 28 వరకు ఆరు రోజుల పాటు సంగీత, నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నట్లు విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్ రాజు, రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం కళాభారతి ఆడిటోరియంలో ఆవిష్కరించి, వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో అకాడమీ కోశాధికారి పైడా కృష్ణ ప్రసాద్, గ్రంధి మల్లికా మనోజ్ పాల్గొన్నారు.

ఇంటింటికీ కూటమి ప్రభుత్వ మోసాలు

- వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



18వ వార్డులో మహిళతో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు, నాయకులు



పదమూడో వార్డులో మహిళలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు

ఆరిలోవ : చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు గమనించాలని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు సూచించారు. జీవీఎంసీ పదమూడో వార్డులో గురువారం ''బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ'' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్, కార్యకర్తలతో కలిసి 16వ నంబర్ బూత్ పరిధిలోని ఇంటింటికీ మొల్లి అప్పారావు వెళ్లారు. మహిళలు, వృద్ధులు, యువకులను కలిసి కూటమి ప్రభుత్వం సాగిస్తున్న మోసపూరిత పాలన గురించి వివరించారు. ఎన్నికల సమయంలో హామీలతో ఆకట్టుకుని... అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కక్షపూరిత పాలన సాగిస్తున్నారని, ప్రశ్నించే వారిని అరెస్ట్ చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మూడుసార్లు పెంచి ప్రజలపై ఆర్థిక భారం మోపారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.శిరీష, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు నిలదీయండి

ఎంవీపీ కాలనీ : సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టో ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన మోసాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. 18వ వార్డులోని 95వ నంబరు బూత్ పరిధిలో గురువారం ''బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ'' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తయినా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. 140 హామీలతో ఓటర్లను మోసం చేసి కూటమి ప్రభుత్వం అడ్డదారిలో గద్దెనెక్కిందన్నారు. ఏడాదిన్నర పాలనలో మహిళలపై నేరాల్లో దేశంలో 2వ స్థానంలో రాష్ట్రం నిలవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కూటమి నాయకులను నిలదీయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ పేర్ల విజయచందర్, వార్డు అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్, పార్టీ పరిశీలకుడు మొల్లి వెంకటరమణ, మహిళ విభాగం అధ్యక్షురాలు శిరీష, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీ, ధనలక్ష్మి, వాసుపల్లి అప్పన్న, మారుపల్లి రాజు, జ్యోతి, సత్యవతి, పరదేశి, చలపతి, గోపి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

మద్దిలపాలెం : జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెం సమీప 238, 246, 250వ నంబరు బూత్‌ల పరిధిలో ''బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ'' కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం నిర్వహించారు. ప్రతీ గడపకు వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరించి కరపత్రాలు అందించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధిని, సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులగం సూర్యనారాయణ రెడ్డి, బోస రమణ రెడ్డి, బోర కుమార్ రెడ్డి, ఎంరెడ్ల ఈశ్వర్‌రెడ్డి, పులగం శ్రీనివాస రెడ్డి, బోర రాంబాబు రెడ్డి, గుడ్ల నర్సింగరావు రెడ్డి, బోస రమణ రెడ్డి, సాడి లక్ష్మణ రెడ్డి, బోయి త్రినాథ్ రెడ్డి, బోయి రమణారెడ్డి, చిల్ల నారాయణ, కారపురెడ్డి దుర్గాజీ, అవ్వ నర్సింగ్ రెడ్డి, ముదిలి శ్రీను, చిల్లా నారాయణరావు రెడ్డి, గుడే శ్రీనివాసరావు, ఎరుసు అరుణ, గుడ్ల త్రినాథ రెడ్డి, అచ్చి సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 28వ వార్డు న్యూ పితాని వీధిలోని 203వ నంబరు బూత్ పరిధిలో ''బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ'' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ బూత్ అధ్యక్షుడు సిమ్మ వినయ్, కొల్లి నూకరాజు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు గడప గడపకు వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు రాపాక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



28వ వార్డులో కరపత్రం అందిస్తున్న పల్లా దుర్గారావు



కరపత్రాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గణపతి ఉత్సవాలకు రాట



రాట మహోత్సవంలో నాయకులు, సంఘ సభ్యులు

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డులో శ్రీకృష్ణ యువజన సంఘం (పీతలవానిపాలెం) ఆధ్వర్యంలో శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవాలకు రాట మహోత్సవం గురువారం మంగాపురంకాలనీ ఆటో స్టాండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. పూజలు చేసి రాట వేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పీతల గోవింద్, గ్రామ కమిటీ సభ్యులు, ఆటో స్టాండ్ సభ్యులు పాల్గొన్నారు.